వరంగల్ వాయిస్
Evening Daily
www.warangalvoice.net
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 80 గురువారం | 21 సెప్టెంబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5




2లో

## హనుమకొండలో తపాలా ఉద్యోగుల జాతీయ మహాసభలు

హాజరు కానున్న బోయినపల్లి, దాస్యం



# టికెట్ల వేట..

## మొదలైన పైరవీలు

కాంగ్రెస్‌లో ఆశావహుల సందడి

అగ్రనేతల అనుగ్రహం కోసం ప్రదక్షిణలు

గెలుపు గుర్రాల కోసం వెతుకులాట

50-55 మందితో తొలి జాబితా

కసరత్తు చేస్తున్న స్క్రీనింగ్ కమిటీ






తెలంగాణ కాంగ్రెస్‌లో ఫుల్ జోష్ నెలకొంది. టిక్కెట్ల కోసం ఆశావహులు పోటీ పడుతున్నారు. పాతకాపులు తమ సీట్లకు ధోకా లేకుండా జాగ్రత్తలు పడుతుండగా వారికి మేము ఏ మాత్రం తీసుపోమంటూ కొత్తవారు సైతం టికెట్ల వేట ప్రారంభించారు. ఈ నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న స్క్రీనింగ్ కమిటీ పెద్ద కసరత్తే చేస్తోంది. సర్వేలు, సామాజిక, స్థానిక రాజకీయ స్థితిగతుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు టికెట్లు ఆశిస్తున్న వారు కాంగ్రెస్ పార్టీ అగ్రనేతల వద్దకు క్యూ కడుతున్నారు. ఐదు అద్భుతాలతో కర్నాటకలో అధికారం చేజిక్కించుకుని ఊపుమీదున్న కాంగ్రెస్ ను మొన్నీమధ్య ప్రకటించిన ఆరు అద్భుతాలు తెలంగాణలో గట్టెక్కిస్తాయన్న ఆశతో ఉన్నారు.

**- వరంగల్ వాయిస్ ప్రతినిధి**

వివరాలు 2లో..



8లో

## ధార్మిక భవన్ ప్రారంభం

ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

భద్రకాళి, వేయి స్తంభాల గుడిలో ప్రత్యేక పూజలు







## కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి

మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

2లో..

# టికెట్ల వేట



- మొదలైన పైరవీలు
- కాంగ్రెస్‌లో ఆశావహుల సందడి
- అగ్రనేతల అనుగ్రహం కోసం ప్రదక్షిణలు
- గెలుపు గుర్రాల కోసం వెతుకులాట
- 50-55మందితో తొలి జాబితా
- కసరత్తు చేస్తున్న స్క్రీనింగ్ కమిటీ

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే గెలుపు గుర్రాలపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి సారించింది. ప్రదేశ్ ఎన్నికల కమిటీ, పీఈసీ ప్రతిపాదనలపై ఇప్పటికే స్క్రీనింగ్ కమిటీ సర్వే పూర్తి చేసింది. అయితే ఇప్పటికే టికెట్ కోసం దరఖాస్తు చేస్తుకున్న నేతలు టికెట్ల వేట ప్రారంభించారు. ఏఐసీసీ ముఖ్యనేతలను సంప్రదిస్తూ ఎలాగైనా తనకు టికెట్ వచ్చేలా చూడాలని వేడుకుంటున్నారు. కొందరు కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను కలిసేందుకు బెంగళూరుకు పరుగులు తీస్తుండగా బీసీ నేతలు ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ బీవీ హరిప్రసాద్ ద్వారా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇటీవల సీడబ్ల్యూసీ సభ్యుడిగా నియమితులైన రఘువీరా రెడ్డి ద్వారా కొందరు పైరవీలు ప్రారంభించారు. ఇదుకోసం ఏపీ బాట పడుతున్నారు. గతంలో కాంగ్రెస్ రాష్ట్ర ఇన్ చార్జులుగా వ్యవహరించిన మాణిక్యం ఠాగూర్, దిగ్విజయ్ సింగ్, వీరప్ప మొయిలీ, దిగ్విజయ్ సింగ్ ను కలిసి తమకు టికెట్ వచ్చేలా చూడాలంటూ వేడుకుంటున్నారు. జైరాం రమేశ్, కొప్పుల రాజా ద్వారా కూడా కొందరు టికెట్ల ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే అంగ భలం, ఆర్థిక బలం ఉండే గెలుపు గుర్రాల వేటలో అధినాయకత్వం ఉన్నట్లు తెలిసింది.

**స్పీడ్ పెంచిన కాంగ్రెస్..**

అసెంబ్లీ ఎన్నికలపై మరింత స్పీడ్ పెంచిన తెలంగాణ కాంగ్రెస్.. అభ్యర్థుల ఎంపికపై పూర్తిస్థాయిలో కసరత్తు మొదలుపెట్టింది. మొన్నటివరకు సీడబ్ల్యూసీ సమావేశం, బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తూ నేతలు బిజీబిజీగా ఉన్నారు. సమావేశాలు ముగియడం, బహిరంగ సభ విజయవంతం కావడంతో కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికపై స్క్రీనింగ్ కమిటీ ఫోకస్ పెట్టింది. పోటీ ఎక్కువగా లేని నియోజకవర్గాలకు ముందుగా అభ్యర్థులను ఖరారు చేసే పనిలో పడ్డారు. ఇందులో భాగంగా మొత్తం 119 స్థానాల్లో ముందుగా 50నుంచి 55 స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేసి మొదటి జాబితాను విడుదల చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. అయితే ఇప్పటికే స్క్రీనింగ్ కమిటీ ఆమోదించిన పేర్లను సీఈసీకి పంపినట్లు సమాచారం. అక్కడ సంతకం పడ్డాక జాబితాను ప్రకటించనున్నారు.

**70 నియోజకవర్గాల్లో ప్రతిష్టంభన ..**

రాష్ట్రంలోని 70 నియోజకవర్గాల్లో ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఈ సెగ్మెంట్లలో పలువురు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నా ఇద్దరి నుంచి ముగ్గురి మధ్యే టికెట్ల కోసం పోటీ తీవ్రంగా ఉంది. ఈ సెగ్మెంట్లనూ ఓ కొలిక్కి తెచ్చేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. అయితే ఈ సెగ్మెంట్లలో అభ్యర్థులను ఎంపిక చేయడం కత్తిమీద సాములా మారనుంది. ఈ నియోజకవర్గాల్లో సామాజిక సమీకరణాలు, సీనియార్టీ, గెలుపు అవకాశాలు పరిగణనలోకి తీసుకొని తుదిరూపు ఇవ్వాల్సి ఉంటుందన్న డిమాండ్ వస్తోంది. మహిళా బిల్లు నేపథ్యంలో ఢిల్లీలోనే ఉన్న కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ సభ్యులు అక్కడే కేంద్ర కమిటీతో భేటీ అయి తొలి జాబితాను ఖరారు చేస్తారని తెలుస్తోంది. అన్నీ సవ్యంగా జరిగితే ఈ వారంలోనే కాంగ్రెస్ తొలి జాబితా విడుదల అయ్యే అవకాశాలున్నాయి.

**బీసీలకు ప్రాధాన్యం..**

కాగ్రెస్ పార్టీ స్క్రీనింగ్ కమిటీ తొలి సమావేశం ఈ నెల 6న హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం. ప్రధానంగా బీసీలకు టికెట్ల కేటాయింపు, మిగతా కులాలకు అవకాశం కల్పించడంపై చర్చ జరిగినట్లు ప్రచారం సాగోతంది. దీంతో చాలా సెగ్మెంట్లపై చర్చించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమైంది. అయితే అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమతుల్యం పాటిస్తున్నట్లు పెద్దలు చెప్పుకొస్తున్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి

**మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**



**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** స్వాతంత్ర సమర యోధుడు తెలంగాణ తొలి దశ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్.డబ్ల్యు.ఎస్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 11వ వర్ధంతి సందర్భంగా గురువారం జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో విగ్రహ ప్రతిష్టాపన కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ రోహిత్ సింగ్ తో కలిసి ఆయన కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ ప్రతిష్టాపన కమిటీ అధ్యక్షులు డాక్టర్ మేడారపు సుధాకర్ , ప్రధాన కార్యదర్శి చిలకమారి సోమేశ్వర్, పాలకుర్తి, కొడకండ్ల గ్రామాల సర్పంచులు వీరమనేని యాకాంతరావు, పసునూరి మధుసూదన్, మండల పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి పెనుగొండ రమేష్, జనగామ జిల్లా పోపా సంఘం కార్యనిర్వహణ కార్యదర్శి చిదురాల ఎల్లయ్య, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు చిలకమారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**కొత్తవాడలో..**

ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని వరంగల్ గోపాలస్వామి ఆలయం సమీపంలోని మహనీయుని నిలువెత్తు విగ్రహానికి నగర మేయర్ గుండు సుధారాణి-ప్రభాకర్ దంపతులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఆడేపు రవీందర్, కో - ఆర్డినేటర్ వోద్నాల నరేందర్, మాజీ జడ్.పి.చైర్మన్ సాంబారి సమ్మారావు, మాజీ కార్పొరేటర్ ఎలుగం శ్రీనివాస్ తో పాటు స్థానిక నేతలు బాసాని శ్రీనివాస్, కట్టం విజయ్, కూచన ఓదెలు, కొలిపాక మధనయ్య, ఎలుగం పెద్ద భద్రయ్య, ఎలుగం చిన్న కొమురయ్య పాల్గొన్నారు.

**కాశిబుగ్గలో..**

కాశిబుగ్గ 'ఓ' సిటీ జంక్షన్ లో ఆకెన వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తెలంగాణ జాతిపిత కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలను వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమములో జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు కుసుమ సతీష్, ఎల్బీ నగర్ పద్మశాలి సేవా సంఘం ట్రస్ట్ అధ్యక్షుడు నుంకనపెల్లి శ్రీనివాస్, పద్మనగర్ పద్మశాలి సేవా సంఘం ట్రస్ట్ అధ్యక్షుడు గంజి సాంబయ్య, పద్మబ్రాహ్మణుడు రాచెర్ల రాజు, బైరి మురళీకృష్ణ, మాటేటి అశోక్ కుమార్, ఆడెపు వెంకటేష్, కోమాకుల నాగరాజు, మార్గం యెల్లయ్య, మాచెర్ల, దీన్ దయాళ్, మాచెర్ల చిన్నారావు, రాజు, వెంగల సురేష్ పాల్గొన్నారు.

**బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో..**

బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లింగబత్తిని రామకృష్ణ, యాదగిరి, కూచన సారయ్య, ఆడెపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**పోపా కార్యాలయంలో..**

కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా గురువారం శివనగర్ పోపా కార్యాలయంలో రాష్ట్ర పోపా అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పోపా జిల్లా నాయకులు మాటేటి అశోక్, సింగం కుమార్, భిక్షపతి, మెరుగు సుభాష్, చెన్నూరి రమేష్, శామంతుల కిరణ్, వంగరి సతీష్, కందకట్ల గణేష్ బాబు,పెద్దూరి పెద్దన్న పాల్గొన్నారు.



## హనుమకొండలో తపాలా ఉద్యోగుల జాతీయ మహాసభలు

### హాజరు కానున్న బోయినపల్లి, దాస్యం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేశవ్యాప్తంగా ప్రతి గ్రామానికి విలువైన తపాల సేవలు అందిస్తున్న గ్రామీణ తపాల ఉద్యోగులు రెండు సంవత్సరాల కొకసారి నిర్వహించే 12వ జాతీయ మహాసభలను చారిత్రక ఓరుగల్లులోని హనుమకొండలో మూడు రోజులపాటు నిర్వహించాలని జాతీయ సంఘం నిర్ణయించింది. అఖిలభారత గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ మహా సభలను విజయవంతం చేసేందుకు గురువారం బోయినపల్లి వినోద్ కుమార్ స్వగృహంలో సమావేశమై ప్రత్యేకంగా ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఆహ్వానసంఘం చైర్మన్ గా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, వైస్ చైర్మన్ గా రాష్ట్ర చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్, ప్రధాన కార్యదర్శిగా బొద్దున వెంకటేశ్వర్లు, ఆహ్వాన సంఘంలో కన్వీనర్లుగా రైల్వే నాయకులు కర్ర యాదవరెడ్డి, రాష్ట్ర సంఘ అధ్యక్షుడు జి.రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బి.జయరాజు, కోశాధికారిగా రాష్ట్రసహాయ కార్యదర్శి మర్రి కొమురారెడ్డి నియమితులయ్యారు. అన్ని బ్రాంచి, డివిజన్ల అధ్యక్ష కార్యదర్శులు, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సబ్ ఆఫీసు ఇంచార్జిలు, ప్రతి గ్రామీణ తపాల ఉద్యోగి ఈ మహాసభలు విజయవంతం చేసేందుకు ముఖ్యభూమిక పోషించనున్నారు. పోస్టల్ డిపార్ట్మెంటులో గ్రామీణ తపాల ఉద్యోగుల కనీస వేతనాలు, కనీస సౌకర్యాల కోసం నిరంతరం పోరాడుతున్న దేశంలో గుర్తింపు కలిగిన ఏకైక యూనియన్ అఖిలభారత గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం. ఈ మహాసభలకు దేశ నలుమూలల నుంచి దాదాపు మూడు వేల మంది ప్రతినిధులు హాజరవుతున్నారు. నవంబర్ 19,20,21 తేదీల్లో మూడు రోజుల పాటు ఆలిండియా ప్రధానకార్యదర్శి ఎస్.ఎస్.మహాదేవయ్య నాయకత్వంలో ఈ జాతీయ మహాసభలు నిర్వహించనున్నారు. గ్రామీణ తపాల ఉద్యోగుల చిరకాల డిమాండ్ అయిన రెగ్యులరైజేషన్ ను ఈ మహాసభలలో చేసే తీర్మానాల ద్వారా నెరవేర్చాలని అందుకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్యవైఖరిపై జరిగే పోరాటాలకు మీ సంపూర్ణ సహకారం అందించాలని డివిజనల్ సెక్రెటరీ బొద్దున వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు.

## మోత్కూరి రాముకి స్వర్ణ కంకణధారణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గత కొన్ని సంవత్సరాలుగా ఆధ్యాత్మికంగా శతచండీ యాగం, కార్తిక దీపోత్సవాలు, దేవాలయ నిర్మాణాలు, దేవాలయాలలో చేసే ధార్మిక సేవలు, ట్రస్ట్ ప్రారంభించి చేస్తున్న సామాజిక సేవలకు గాను ట్రస్ట్ చైర్మన్ మోత్కూరి రాముకు హనుమకొండలో నిర్వహించిన మేథోమథనం సదస్సులో దర్శిని గ్రూప్ చైర్మన్ వద్దాల నాగరాజు చేతుల మీదుగా స్వర్ణ కంకణదారణ (గండబేరుండం) ప్రధానం చేశారు. వేదమూర్తులైన నరేంద్ర కాప్రే, విఠాల వెంకట్రామ శాస్త్రి, కొడకండ్ల రాధాకృష్ణ శర్మ, షణ్ముక ఘనాపాఠి వేద మంత్రాలతో తెలంగాణ సంక్షేమ పరిషత్ సభ్యులు దర్శనం వెంకన్న, జోషి గోపాల్ శర్మ, హన్మంతచారి, విష్ణుదాసు శ్రీకాంత్ సమక్షంలో కంకణ దారణ జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు జగన్మోహన్ శర్మ, రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన బ్రాహ్మణనేతలు, కనకదుర్గ గ్రూపు చైర్మన్ రాగిడి తిరుపతి రెడ్డి, రామమ్ గ్రూపు చైర్మన్ బన్న సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ యువజన సంఘం కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, రాయపర్తి:** మండలంలోని సన్నూరు గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిన్నపాక యాకస్వామి, ఉపాధ్యక్షుడిగా చిన్నపాక జ్యోతిబసు, ప్రధాన కార్యదర్శిగా వంగాల మోహన్, కోశాధికారిగా చిన్నపాక సాయిరాం ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో చిన్నపాక యాకయ్య, ఎల్లయ్య, ఐలయ్య, సుధీర్, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం



**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు మండలం జంగాలపల్లి క్రాస్ రోడ్ వద్ద గురువారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వరంగల్ నిట్ విద్యార్థులు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి డివైడర్ కు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ముర్తుజా (హైదరాబాద్), ఉమర్ (హైదరాబాద్) సాయి (హైదరాబాద్), శ్రేయ (విజయవాడ), సుజిత్ (హైదరాబాద్) అనే ఐదుగురికి గాయాలయ్యాయి. మరో విద్యార్థిని తాడేపల్లి నిస్సి సిజు (ఏలూరు-18 ఏళ్ల) బీటెక్ సివిల్ సెకండ్ ఇయర్‌కు చెందిన విద్యార్థిని మృతి చెందింది. వీరంతా బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు. గాయాలపాలైన వారిని 108 అంబులెన్స్ లో ములుగు ప్రాంతీయ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఆ తర్వాత నలుగురు విద్యార్థులను రోహిణి హాస్పిటల్ లో చేర్చగా, ఒక విద్యార్థి(సాయి)ని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

# అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** అంగన్వాడీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలంటూ సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అగన్వాడీ ఉద్యోగులు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యావతి రాథోడ్ క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన నిర్వహించారు. తోలుత పట్టణంలో అంగన్వాడీ టీచర్ లు, ఆయాలు వేలాది మందిగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సమయంలో మంత్రి క్యాంపు కార్యాలయ సమీపంలో పోలీసులు భారీకేడ్లు ఏర్పాటు చేసి అంగన్వాడీ ఉద్యోగులను అడ్డుకున్నారు. దీంతో ఉద్యోగులు చొచ్చుకొని పోవడానికి ప్రయత్నించడంతో పోలీసులు ప్రతిఘటించడంతో కొద్ది సేపు పోలీసులకు ఆందోళనకారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకొని తోపులాట జరిగింది. ఉద్యోగులు పోలీసులను తోసుకుంటూ వచ్చి మంత్రి క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించి, బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఉద్యోగులు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ కార్యాయలయ ప్రాంతాన్ని హోరోత్తించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నేతలు మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. నిర్భంధం విధిస్తే పోరాటం మరింత ఎగిసిపడుతుందన్నారు.

# మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, నడికూడ :** పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు శిక్షణ తీసుకున్న మహిళలకు గురువారం నడికూడ మండలం నర్సక్కపల్లి గ్రామంలో ఉచితంగా కుట్టుమిషన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కుట్టుమిషన్ శిక్షణ తీసుకున్ ఓరువాల సుమలత మాట్లాడుతూ ఉచితంగా కుట్టు మిషన్లు చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి, గ్రామ సర్పంచ్, గ్రామ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాగుల ధర్మారావు, సీనియర్ నాయకులు పాడి ప్రతాప్ రెడ్డి, బైరెడ్డి, భాష బోయిన కొమురయ్య యాదవ్, వార్డు మెంబర్లు భోగం లక్ష్మీ భిక్షపతి, నారగోని మల్లయ్య గౌడ్, పాడి ప్రవళిక, జీవన్ రెడ్డి, నాగుల అరుణాబై బాపూరావు, బాసిడి రాజు, తాళ్లపల్లి సరోజన సురేష్, పల్లబోయిన సుమలత మహేందర్, వర్ణం శ్రీధర్ రెడ్డి, కోడిపాక రవీందర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు తాళ్లపల్లి రమేష్ గౌడ్, ప్రముఖులు పాల్గొని చీరలు, కుట్టు మిషన్లు మహిళలకు పంపిణీ చేశారు.

# ఖేలో ఇండియా నిర్వహించడం అభినందనీయం

## చీఫ్ విప్ వినయ్ భాస్కర్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఖేలో ఇండియా కార్యక్రమం నిర్వహించడం ఎంతో అభినందనీయమని ప్రభుత్వ చీఫ్ విప్, పశ్చిమ శాసనసభ్యుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. జేఎన్ఎస్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ - అథ్లెటిక్స్ మీట్ లో ప్రభుత్వ చీఫ్ విప్ మాట్లాడుతూ వచ్చే నెలలో సౌత్ జోన్ పోటీలకు హనుమకొండ నగరం ఆతిథ్యం ఇస్తుందని అన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని తెలిపారు. నగరం ఇప్పటికే ఎడ్యుకేషనల్ హబ్ గా, హెల్త్ హబ్ గా, స్పిరిచువల్ హబ్ గా మారిందని, స్పోర్ట్స్ హబ్ గా చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. జేఎన్ఎస్ స్టేడియంలో మౌలిక వసతులను ఇప్పటికే పెంచామని తెలిపారు. క్రీడాకారులకు కావలసిన అన్ని సౌకర్యాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ భారతీయ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారన్నారు . నేడు నిర్వహిస్తున్న అథ్లెటిక్స్ పోటీలు వారి సామర్థ్యాలను వెలికితీసేందుకు ఉపయోగపడతాయని, రాష్ట్ర ప్రభుత్వం సైతం క్రీడలకు ప్రముఖ ప్రాధాన్యతనిస్తుందని అన్నారు. పశ్చిమ శాసనసభ్యుడు, చీఫ్ విప్ నాయకత్వంలో క్రీడల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామని అన్నారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా జేఎన్ఎస్ స్టేడియాన్ని ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు. తదనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో క్రీడల అభివృద్ధికి స్థానిక శాసనసభ్యుడు దాస్యం వినయ్ భాస్కర్ ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ ఆటల్లో, చదువుల్లో సైతం రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం అథ్లెటిక్స్ లో గెలుపొందిన వారికి పథకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, డి ఎస్ డీఓ అశోక్ కుమార్, సారంగపాణి, సృజన్ కాంత్, చంద్రమోహన్, ఎండీ గౌస్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని కలిసిన టీఎన్జీఓస్ నాయకులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో భద్రకాళి దేవస్థానానికి విచ్చేసిన దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకీరణ్ రెడ్డిని, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ లను హనుమకొండ జిల్లా టీఎన్జీఓస్ బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరి వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘ నాయకులు డీవీఆర్ శర్మ, శ్యాంసుందర్, రాము నాయక్, లక్ష్మీప్రసాద్, జిల్లా నాయకులు శ్రీనివాస్ రాజమౌళి, సురేష్, రాజేష్ ఖన్నా, హరినాథ్, సుధాకర్ రెడ్డి, రాజీవ్, పైడిరాజు, ప్రణయ్, రవీందర్, అశోక్, రాజు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# తృణధాన్య గణపతికి రాకేష్ రెడ్డి ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని 29వ డివిజన్, పాపయ్య పేట్ చమన్ లోని స్థానిక యువత ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తృణ ధ్యాన గణపతి స్వామిని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్ రెడ్డి దర్శించుకొని, ఆ సిద్ది వినాయకుడి ఆశీస్సులతో అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ఈ సందర్భంగా రాకేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఏటా ఎంతో వినూత్నంగా నిర్వహించే తృణధాన్య గణపతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. మన దేశం అత్యధికంగా వ్యవసాయం మీద ఆధారపడ్డ దేశం కాబట్టి, రైతు దేశం కాబట్టి మన సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా తృణధాన్యాలతో బొజ్జగణపయ్య ను పూజించడం గొప్ప ఆలోచనని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నిరంజన్, కొత్తపెల్లి రాజేష్, రవీందర్ రెడ్డి, లక్ష్మణ్, నదియా, సాయి, రోహిత్, సురేష్, అశోక్, సతీష్ రెడ్డిలు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు తొలి అడుగు మహిళా బిల్లు



**వరంగల్ వాయిస్, సుబేదారి :** మహిళా బిల్లు మొదటిసారి లోక్ సభలో ఆమోదం పొందటంతో మహిళా సాధికారతకు తొలి అడుగు పడినట్లుగానే భావించాలని అర్థశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ శ్రీధర్ కుమార్ అభిప్రాయబడ్డారు. గురువారం యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మహిళా బిల్లుపై బీఏ మొదటి సంవత్సరం విద్యార్థులు నిర్వహించిన కార్యక్రమంలో శ్రీధర్ కుమార్ మాట్లాడుతూ 27సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత లోక్ సభలో మహిళా బిల్లు ఆమోదం పొందడంతో భారతదేశ రాజకీయాలలో సరికొత్త చరిత్ర మొదలైనట్లుగా భావించాలని అభిప్రాయబడ్డారు. ఈ మహిళా బిల్లుతో చట్టసభలలో మహిళల ప్రాతినిధ్యం, ప్రాధాన్యత పెరగటమే కాకుండా మహిళా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ఈ బిల్లులో ఓబీసీ సబ్ కోట కూడా ఉండి ఉంటే మరింత అర్థవంతంగా ఉండేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించిన డాక్టర్ తిరునాహరి శేషు మాట్లాడుతూ మార్గరెట్ తాచర్, ఇందిరాగాంధీ, ఏంజెలా మెర్కల్ లాంటివారు చట్టసభలలో రాజకీయాలలో పాలనలో తమదైన ప్రత్యేక ముద్రను, సామర్థ్యాన్ని నిరూపించుకున్నారని తెలిపారు. దేశ అధ్యక్షులుగా, ప్రధాన మంత్రులుగా, ముఖ్యమంత్రులుగా, కేంద్ర మంత్రులుగా మహిళలు అనేక సందర్భాల్లో పురుషులకంటే అత్యంత సమర్థవంతంగా పనిచేసిన సందర్భాలు ఉన్నాయని అన్నారు. చంద్రయాన్ 3లో నారీ శక్తి ఏ విధమైన పాత్ర పోషించిందో మహిళా బిల్లుతో రాజకీయాలలో, పాలనలో మహిళలకు వచ్చే అవకాశంతో అంతకంటే గొప్ప పాత్రను దేశాభివృద్ధిలో పోషిస్తారనే ఆశా భావాన్ని వ్యక్తం చేశారు. బీఏ మొదటి సంవత్సరానికి చెందిన విద్యార్థినిలు రిత్విక, పూజ, రేణుక మహిళా బిల్లుపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

# మహంకాళి ఆలయంలో ట్రాన్స్ ఫార్మర్ నిర్మిస్తే కూల్చేస్తాం

## మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని స్థానిక అమరధామం ఎదురుగా ఉన్న శ్రీమహంకాళి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మున్సిపల్ అధికారులు సంబంధిత కాంట్రాక్టర్ తో కరెంటు ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని బుధవారం కాంట్రాక్టర్ సిబ్బందిని పంపారు. మహంకాళి అమ్మవారి ఆలయ కమిటీ అధ్యక్షుడు మోరే సదానందం, కమిటీ సభ్యులు అడ్డుకోగా అడ్డుకున్నారు. దీంతో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బెదిరించడంతో విషయం తెలుసుకున్న భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు మార్త భిక్షపతి అధ్యక్షతన ఆలయానికి బీజేపీ నాయకులు చేరుకొని విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు . ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మొలుగురి భిక్షపతి మాట్లాడుతూ పరకాల పట్టణంలో మోరే వంశస్థుల పూర్వీకులు నుంచి ఇలవేల్పులుగా కొనసాగుతున్న మహంకాళి అమ్మవారి ఆలయ స్థలంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి స్థానిక మున్సిపల్ కమిషనర్ ట్రాన్స్ ఫార్మర్ వేయాలని ఆలయ కమిటీ సభ్యులను ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. పరకాల పట్టణంలో స్థానిక అమరధామంలో ఉన్న ఏరియాలో ప్రభుత్వ స్థలం, ప్రభుత్వ కార్యాలయ బిల్డింగ్ లలో ఎక్కడైనా ట్రాన్స్ ఫార్మర్ వేసుకోవచ్చునని, కానీ మహంకాళి ఆలయమే దొరికిందా అని నిలదీశారు. రెండు రోజుల్లో మహంకాళి ఆలయంలో నిర్మించిన ట్రాన్స్ ఫార్మర్ గద్దెను కూలగొట్టకుంటే దగ్గరుండి కూలగొట్టిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాచం గురు ప్రసాద్, రాష్ట్ర నాయకులు దేవునూరి మేఘనాథ్, నాయకులు స్థానిక వార్డు కౌన్సిలర్ ఆర్పీ జయంతి లాల్, పట్టణ ప్రధాన పట్టణ ప్రధాన కార్యదర్శి గాజుల నిరంజన్, కుక్కల విజయ్ కుమార్, రూరల్ అధ్యక్షుడు పుట్ట రవీందర్, ఉపాధ్యక్షులు నాగెల్లి రంజిత్, సీనియర్ నాయకులు దుబాసి వెంకటస్వామి, చిలువేరు చిరంజీవి, గుండు శ్రీధర్ లు పాల్గొని అనంతరం సంబంధిత కాంట్రాక్టర్ కుమారస్వామికి,మున్సిపల్ కమిషనర్ శేషుకు ఎండోమెంట్ ఇచ్చిన లెటర్ ను మహంకాళి ఆలయ కమిటీతో అందజేశారు.

## కాశిబుగ్గలో మహా అన్నదానం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ నగరంలోని కాశిబుగ్గ 19వ డివిజన్ లో గురువారం శ్రీ విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్, విఘ్నేశ్వర సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో 35వ సంవత్సర గణపతి నవరాత్రి ఉత్సవంలో భాగంగా మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాదాపుగా 2000 మందికి మహా అన్నదానం చేశారు. అధ్యక్షుడు వంగరి జయ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి దాసి శివకృష్ణ, కోశాధికారి రామ సతీష్ కుమార్, ఓరుగంటి రాజేందర్, భోగ విజయ్ కుమార్, బొగ రవికుమార్, దాసి సాయికుమార్, దాసరి మల్లికార్జున్, దాసి జయ ప్రకాష్, కర్ణల సాయికుమార్, భోగ శ్రీనివాస్, అడుప ప్రవీణ్ కుమార్, రామా కార్తీక్, దాసి నాగరాజు, రామా క్రాంతి, రామా విష్ణు, బోగ్ శేశాంక్, రామా శివ, మహిళలు వంగరి నాగరాణి, దాసి దీప్తి, శ్రీ కల, రామా సునీత, దాసి రాణి, బొగా కవిత, ఓరుగంటి రాము, మారోజు ప్రియాంక, వడ్నాల రేష్మ పాల్గొన్నారు.

## జ్వరంతో ఏడాది బాలుడి మృతి



**వరంగల్ వాయిస్, మల్హర్ :** జ్వరంతో బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కుంభంపల్లి గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని కుంభంపల్లి గ్రామానికి చెందిన తోటపల్లి స్వరూప మల్లయ్య దంపతుల ఏడాది కుమారుడు తోటపల్లి స్టీవెన్ పాల్ కు గత 15రోజుల క్రితం జ్వరం రాగా కరీంనగర్ లోని ఒక ప్రైవేట్ హాస్పిటల్ కు తీసుక వెళ్లగా డెంగీగా నిర్ధారణ అయింది. కరీంనగర్ లో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో రెండు రోజుల క్రితం హైదరాబాద్ నీలోఫర్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. బాలుడి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల బస్ డిపో శ్రీ రేణుక ఎల్లమ్మ గుడి దగ్గర విగ్రహ కమిటీ అధ్యక్షుడు బండి కుమారస్వామి గౌడ్ ఆధ్వర్యంలో శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ సోదా అనిత రామకృష్ణ, వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి, పరకాల మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ, చింతిరెడ్డి మధుసూదన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు డా.మడికొండ శ్రీను హాజరయ్యారు. గౌరవ కౌన్సిలర్లు మడికొండ సంపత్ కుమార్, గొర్రె స్రవంతి రాజు, నల్లెల్ల జ్యోతి అనిల్ కుమార్,పసుల లావణ్య రమేష్, బండి రాణి సదానందం గౌడ్, శనిగరపు రజిని నవీన్, మార్క ఉమాదేవి రఘుపతి గౌడ్, ఏకు రాజు, రాష్ట్ర, జిల్లా గౌడ పెద్దలు, కులస్తులు, బీఆర్ఎస్ పార్టీ మహిళ నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

## తడి పోడి చెత్త వేరు చేయాలి




**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని రావూరు గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం సర్పంచ్ బండి సంతోష్ ఆధ్వర్యంలో "స్వచ్ఛతా హీ సేవా"కార్యక్రమంపై ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రత, తడిపోడి చెత్త వేరు వేరుగా వేయాలని, ప్రతి ఇంటి ఆవరణం పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు తెలిపారు. గ్రామ ప్రజలు డెంగీ, మలేరియా బారిన పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ఇటీవల దోమల నివారణ చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. స్థానిక మహిళలతో పిచ్చి మొక్కలు తొలిగించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అమ్మిలాల్, గ్రామ పార్టీ అధ్యక్షుడు నోముల రమేష్, కార్యదర్శి రాజు, వార్డు సభ్యులు, వీఓ అధ్యక్షులు చీకటి యాకలక్ష్మి, ఆశా వర్కర్ బండి లావణ్య, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## యువతకు డ్రైవింగ్ లైసెన్స్‌ల పంపిణీ



**వరంగల్ వాయిస్, చిట్యాల :** మండలంలోని జూకల్ గ్రామంలోని బీఎస్ఆర్ ఫంక్షన్ హాల్ లో జీఎంఆర్ఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో చిట్యాల మండల యువతీ యువకులకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ, అర్హులకు లైసెన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా భూపాలపల్లి శాసన సభ్యుడు గండ్ర వెంకట రమణా రెడ్డి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, వరంగల్ జిల్లా జడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి, జీఎంఆర్ఎం ట్రస్ట్ జనరల్ సెక్రెటరీ గండ్ర గౌతమ్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గండ్ర గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ జీఎంఆర్ఎం ట్రస్ట్ ద్వారా దాదాపు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో ఉచిత డ్రైవింగ్ శిక్షణ తరగతులు అందించడం జరిగిందని, చివరి గ్రామం వరకు డ్రైవింగ్ తరగతులు, అర్హులకు లైసెన్స్ లు అందిస్తామన్నారు. సామాజిక సేవ కార్యాక్రమాలతో పాటు ప్రభుత్వ పరమైన పథకాలను అమలు చేస్తూ ముందుకెళతామని ఎమ్మెల్యే గండ్ర దంపతులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, యువతీ యువకులు పాల్గొన్నారు.

## మేపా వరంగల్ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా కలకొండ అభినాష్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషన్స్ అసోసియేషన్ (మేపా )రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పెండం మధుసూదన్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం వరంగల్ శివనగర్ లో వరంగల్ జిల్లా నూతన ఎన్నిక కమిటీని ఎన్నకున్నారు. ఈ ఎన్నికలో మేపా వరంగల్ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా కలకొండ అభినాష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అలాగే ప్రధాన కార్యదర్శిగా పెండ్యాల కృష్ణ ముదిరాజ్, పిట్టల రాజు, ఇండ్ల ఏకలక్ష్మి ముదిరాజ్, కీసరి సాంబరాజు, సదానందం, శ్రీకాంత్, సతీష్, సంయుక్త కార్యదర్శిగా సునీల్ ప్రభాకర్, సురేష్, సోషల్, మీడియా ఇంచార్జిగా ముత్యం రాజు, సమన్వయ కమిటీ సభ్యుడిగా దండు చిరంజీవిలను ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేపా రాష్ట్ర అధ్యక్షుడు డా.కొత్తగట్టు శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ రానున్న రోజులలో ముదిరాజులు రాజకీయంగా క్రియాశీలక పాత్ర పోషించనున్నామని అన్నారు. అలాగే ఆర్థిక, రాజకీయ, వ్యాపార, వాణిజ్యంగా అభివృద్ధి చెందాలని, రాజకీయాలకతీతంగా పని చేయాలని కోరారు. వివిధ గ్రామాలు మండలాల నుంచి విచ్చేసిన ముదిరాజ్ బంధుమిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కలకొండ అభినాష్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఈ బాధ్యత ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు కొత్తగట్టు శ్రీనివాస్ ముదిరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్, గుండాల మదన్ కుమార్, మేపా రాష్ట్ర కమిటీ సభ్యులు మొగిలి, వేణు మాధవ్, సింగారపు రామకృష్ణ, రాజు, తాళం రవీందర్, భైరవన ఎల్లేష్, భిక్షపతి, కీసరి సాంబరాజు, ముత్యం, తదితరులు పాల్గొన్నారు.

## మహా గణపతికి అభిషేకం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని 20వ డివిజన్ లో గురువారం ఎంతో భక్తి శ్రద్ధలతో మహాగణపతికి మహా అభిషేకాన్ని నిర్వహించారు. మహిళా ఆడపడుచులు అందరూ కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు ధర్మాజీ శంకర్, ఉపాధ్యక్షుడు పిట్టల సంతోష్, ప్రధాన కార్యదర్శి రవీందర్, అర్చకులు పెద్దూరు శ్రీనివాస్, పిట్టల కోటి, మహిళా ఆడపడుచులు పుష్ప, స్రవంతి, వాసవి, కవిత, సంధ్య, రాజ్యలక్ష్మి, లక్ష్మి, శ్రీజ, భాగ్యలక్ష్మి, రోజా రాణి, మంజుల, మాధవి పాల్గొన్నారు.

## స్టీల్ బ్యాంక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే అరూరి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ 55వ డివిజన్ భీమారంలోని మహిళ కమ్యూనిటీ భవనంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అధ్వర్యంలో ఏర్పాటు చేసిన రుద్రమదేవి స్టీల్ బ్యాంక్ ను గురువారం బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రజిత -శ్రీనివాస్, సిరంగి సునీల్, మెప్మా పీడి బద్రు నాయక్, మెప్మా అధికారులు రమేష్, రాజేశ్, డివిజన్ అధ్యక్షులు రవీందర్, మనీంద్ర నాథ్, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివని, ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని శాయంపేట మండల పద్మశాలి నాయకులు వంగరి సాంబయ్య అన్నారు. తెలంగాణ వాది, స్వాతంత్ర సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ 11వ వర్ధంతిని పురస్కరించుకొని శాయంపేట బస్టాండ్ కూడలిలో గురువారం బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివని, తెలంగాణకు ఎనలేని సేవలను అందించారని పేర్కొన్నారు. తొలి, మలిదశ ఉద్యమాల్లో తెలంగాణ కోసం వారు పాటుపడ్డారని అన్నారు. బాపూజీ జీవితమంతా తెలంగాణ కోసం శ్రమించారని కొనియాడారు. తెలంగాణ ప్రజలు గొప్పగా ఆరాధించే వ్యక్తి కొండా అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి నాయకులు చిందం రవి, బాసని సదాశివుడు, బూర కుమారస్వామి, అశోక్, గాజుల రాజు, బాసని ప్రకాష్, చిలుకూరి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## శాయంపేటలో..



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన చేనేత జౌళిశాఖ మంత్రి పదవిని సైతం త్రుణపాయంగా భావించి రాజీనామా చేసిన గొప్ప త్యాగశీలి, పద్మశాలీల ముద్దుబిడ్డ స్వర్గీయ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 11వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి చేనేత సహకార సంఘం పీసీసీ చైర్మన్ మామిడి శంకర్ లింగం, పాలకవర్గ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శంకర్ లింగం మాట్లాడుతూ మూడు తరాల ఉద్యమ పోరాట కెరటం, చేనేత సహకారోద్యమ పితామహుడు, బడుగు బలహీన, అనగారిన వర్గాల ఆశాజ్యోతి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. తొలి, మలి దశ తెలంగాణ పోరాటంలో మొదటి నుంచి ముందుండి తనదైన శైలిలో పోరాడిన ఘనత బాపూజీవది అని అన్నారు. పద్మశాలీలను ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతం చేయడానికి అహర్నిశలు కృషి చేశాడని, చేనేత సహకార సంఘాలను నెలకొల్పుటకు తన శక్తి వంచన లేకుండా పని చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఐసీ మెంబర్లు బూర లక్ష్మీనారాయణ, రంగు ఆనందం, దాసరి సమ్మయ్య, దిద్ది ప్రభాకర్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పరకాలలో..



**వరంగల్ వాయిస్, పరకాల :** బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో స్వర్గీయ గురిజాల అప్పారావు గారి జయంతి వేడుకలు, తెలంగాణ వాది స్వర్గీయ కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమం పరకాల పట్టణంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ మడికొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మడికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ మహానుభావుల పుణ్యమే మనకు తెలంగాణ అని అన్నారు. మున్సిపల్ చైర్మన్ అనిత రామకృష్ణ మాట్లాడుతూ ఈ నాయకుల స్ఫూర్తితో మనం ముందుకు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ ఎస్ నాయకులు , ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కాశిబుగ్గలో..



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని 21వ డివిజన్ లో గురువారం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 11వ వర్ధంతిని ఎల్బీనగర్ పద్మశాలి సేవా సంఘం ట్రస్టు భవనంలో సేవా సంఘం అధ్యక్షుడు సుంకనపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గోషికొండ సుధాకర్, ఆకెన వెంకటేశ్వర్లు, కోమాకుల నాగరాజు, బైరి మురళీకృష్ణ, గాదే ప్రభాకర్, బింగి మహేష్, మార్గం ఎల్లయ్య పాల్గొన్నారు.

# అన్నదాతలకు అండగా సీఎం కేసీఆర్

### ఎమ్మెల్యే అరూరి రమేష్



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట:** తెలంగాణ రాష్ట్రంలో రైతు సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. గురువారం వర్ధన్నపేట మున్సిపాలిటీలోని లక్ష్మి గార్డెన్స్ లో జరిగిన వర్ధన్నపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన 1013మంది రైతులకు పంట నష్ట పరిహారం (ఇన్ పుట్ సబ్సిడీ)కింద మంజూరైన రూ. 72 లక్షల 24 వేల చెక్కులను వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి ఎమ్మెల్యే అరూరి రమేష్ రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని అనేక రైతు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని తెలిపారు. అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు భరోసా కల్పించాలని, ఎకరాకు 10వేల రూపాయల నష్ట పరిహారాన్ని అందిస్తున్న గొప్ప నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని కొనియాడారు. రైతు బంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్, సాగు నీరు అందిస్తూ తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, అగ్రికల్చర్ ఏడీఏ సురేష్, ఎంపీపీ అప్పారావు, జడ్పీటీసీ భిక్షపతి, మున్సిపల్ చైర్మన్ అరుణ, ఆత్మ చైర్మన్ గోపాల్ రావు, పాక్స్ చైర్మన్ రాజేశ్ కన్నా, మార్కెట్ చైర్మన్ స్వామీ రాయుడు, రైతు బంధు కోఆర్డినేటర్ మోహన్ రావు, వైస్ ఎంపీపీ చొప్పరి సోమలక్ష్మి-సోమయ్య, అగ్రికల్చర్ అధికారులు, రైతులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికీ ఆరోగ్య శ్రీ కార్డులు



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య శ్రీ డిజిటల్ హెల్త్ కార్డు శిబిరం ప్రారంభించడం జరిగిందని సర్పంచ్ శ్రీపతిబాపు అన్నారు. రేషన్ కార్డులో పేరు నమోదు చేయబడిన ప్రతి ఒక్కరూ ఆరోగ్య శ్రీ కార్డు కోసం దరకాస్తు చేసుకోవచ్చని, సీఎస్ సీ ఆన్ లైన్ సెంటర్లు, మీ సేవ లో ఆధార్ కార్డు కేవైసీ చేసుకొని డిజిటల్ కార్డులు పొందవచ్చని అన్నారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్, ఆధార్ లింక్ మొబైల్ నెంబర్, పాస్ ఫొటోతో ఆన్ లైన్ లో దరకాస్తు చేసుకోవాలని అన్నారు. ఆరోగ్య శ్రీ కార్డు పరిధిని రూ.2లక్షల నుంచి 5లక్షలకు పెంపు నిర్ణయం హర్షణీయమన్నారు.గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎస్ సీ సెంటర్ నిర్వాహకులు సందీప్ కుమార్, చింతకుంట్ల రాం దాస్, కిష్టస్వామి, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు అలీం ఖాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ వెన్నంపల్లి మహేష్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం శుభ పరిణామం

### బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గత 75ఏళ్లలో ఎన్నోచోట్ల ఎన్నో విధాలుగా మహిళ బిల్లు కోసం చర్చలు జరిగాయని, రాజ్యసభలో కూడా ఒకసారి మహిళ బిల్లు ఆమోదించబడింది, కానీ అనాడు కాంగ్రెస్ పార్టీ, దాని మిత్రపక్షాల స్వలాభం కోసం, వారు చేసిన రాజకీయాల కారణంగా ఆ బిల్లు ఆమోదం పొందలేదని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. ఈ సందర్భంగా గురువారం రావు పద్మ మాట్లాడుతూ నేడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో భారత మహిళలకు లోక్‌సభలో, రాష్ట్ర అసెంబ్లీ సీట్లలో మహిళలకు స్థానాలను రిజర్వ్ చేసి వారికి కానుకగా అందించారని అన్నారు. తోటి మహిళమణులందరికీ అభినందనలు తెలియజేశారు. మహిళా ఆధారిత దేశ అభివృద్ధి దిశగా ఇది మరో కీలక అడుగు అని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందడంతో, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఏదైనా సాధ్యమేనని మోదీ మరోసారి నిరూపించారని కొనియాడారు. ఈ బిల్లు ఎటువంటి ఆటంకాలు లేకుండా రాజ్యసభలో కూడా ఆమోదం పొందుతుందని తనకు నమ్మకం ఉందని ఆమె తెలిపారు.

## గణపతి నవరాత్రి ఉత్సవాల్లో నాయిని

**వరంగల్ వాయిస్, కాజీపేట :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం, కాజీపేట 62 డివిజన్ సోమిడికి వెళ్లే ప్రధాన రహదారి వైఎస్ఆర్ నగర్ సమీపంలో గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ సిద్ధి వినాయక యువజన సంఘం విష్ణుపురి వారు నిర్వహించిన కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ సిద్ధి వినాయక యువజన సంఘం నాయిని రాజేందర్ రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కాజీపేట డివిజన్ అధ్యక్షుడు, సీనియర్ నాయకులు, శ్రీ సిద్ధి వినాయక యువజన సంఘం నాయకులు, కాసిన లెనిన్ బాబు, బండి శివ కుమార్, చిన్న, కార్తీక్ ఠాకూర్, సూరజ్ గారేపల్లి సతీష్, పాల్గొన్నారు.

## కూచిపూడి నృత్య ప్రదర్శన



**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేట పట్టణంలోని డీజిల్ కాలనీలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో 44వ గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీకృష్ణ మ్యూజికల్ డాన్స్ స్కూల్ వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ నృత్య ప్రదర్శనలో శ్రీకృష్ణ కూచిపూడి నృత్య కళానిలయం 30మంది పిల్లలచే నృత్య ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో కల శారద బృందం, ఆలయ కమిటీ సెక్రటరీ పి.సూర్యరావు, వెంకటయ్య , ఆంజనేయులు, పద్మారావు, రామకృష్ణ, బాబురావు, సురేష్, మనోజ హరీష్ ప్రేమ్, కిషోర్, పునీత్, ప్రేమ్ సాయి ఆలయ పూజారి ప్రసాద్ శర్మ, రాజేష్ శర్మ, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైద్యం వికటించి మహిళ మృతి



**వరంగల్ వాయిస్, దేవరుప్పుల :** మండలంలోని ధర్మపురం గ్రామానికి చెందిన జాటోతు లక్ష్మి గత రెండురోజుల జ్వరంతో బాధపడుతుండగా కొడకండ్ల మండలం రామన్నగూడెం వద్ద ఉన్న ఆర్ఎంపీ డాక్టర్ సోమయ్య వద్దకు వెళ్లగా అతను ఇంజెక్షన్ ఇవ్వగా ఒక్కసారిగా, స్పృహ కోల్పోయింది. వెంటనే మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్ లో జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలికి భర్త జాటోత్ నరేష్, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆర్ఎంపీ డాక్టర్ పై కేసు నమోదు చేసి బాధితురాలు కుటుంబానికి న్యాయం చేయాలంటూ జనగాం -సూర్యాపేట ప్రధాన రహదారిపై మృతురాలి బంధువులు ఆందోళనకు దిగడంతో పాటు దేవరుప్పుల పోలీస్ స్టేషన్ ఎదుట మృతదేహంతో భైఠాయించి ధర్నా చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ డి.విశ్వేశ్వర్, ఏస్సై శ్రవణ్ కుమార్ పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

# సమాజమే ప్రభావితం చేస్తుంది



















## పెను మార్పులు తెచ్చిన కృత్రిమ మేధస్సు

## దానితోనే విరాజిల్లుతున్న సాంకేతిక విప్లవం

## రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ పార్థసారథి

**భారతీయుల మేథా శక్తి ఎంతో గొప్పదని, ప్రతి రంగంలో రాణించడానికి గల కారణం మనలో ఉన్న శక్తి సామర్థ్యాలేనంటూ రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ పార్థసారథి తేల్చి చెప్పారు. ఇందుకు నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ జీవితాన్ని ఉదాహరించారు. నేటి సాంకేతిక రంగంలో కృత్రిమ మేథస్సు పెను మార్పులను తీసుకొస్తుందన్నారు. దాంతో సాంకేతిక విప్లవం విరాజిల్లుతోందని వివరించారు. నేటి జీవన విధానంలో అనేక మార్పులు, చేర్పులు రావడానికి గల కారణం సాంకేతికంగా పురోగతి సాధించడమేనన్నారు.**

**- వరంగల్ వాయిస్, నిర్మల్**

**వరంగల్ వాయిస్, నిర్మల్ :** మన చుట్టూ ఉన్న సమాజమే మనల్ని ప్రభావితం చేస్తుందని దాంతో మానసిక వికాసం, విశ్లేషణ నైపుణ్యాభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ పార్థసారథి తెలిపారు. ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ నూతన ఆలోచనలతో ఆవిష్కరణలు సాధ్యమవుతాయని, ఉపాధి ఉద్యోగ అవకాశాలు నైపుణ్యాలపైనే ఆధారపడి ఉంటాయన్నారు. గురువారం ఆర్జీయూకేటీ బాసరను పార్థసారథి సందర్శించిన నేపథ్యంలో ఆయనకు నిర్మల్ జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డి, భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఆర్జీయూకేటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సతీష్ కుమార్ పూల మొక్కతో సాదరంగా స్వాగతం పలికారు. తదనంతరం పోలీసులనుంచి గౌరవ వందనం స్వీకరించారు. తదనంతరం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన స్టూడెంట్ ఆక్టివిటీ సెంటర్ కి చేరుకున్న ఆయన విద్యార్థులు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడం ఎలా? సాంకేతిక రంగంలో నైపుణ్యాలు సాధించుకోవడం ఎలా? అనే అంశాలపై సుదీర్ఘంగా ప్రసంగించారు. విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించి వారిలో నూతన ఉత్తేజాన్ని నింపారు. నైపుణ్యం ప్రదర్శించిన వారికి బహుమతులను అందజేశారు. విద్యార్థులు భవిష్యత్తును నిర్దేశించుకోవడంలో ఎటువంటి సందేహాలు లేకుండా ముందుకు సాగిపోవాలని పిలుపునిచ్చారు.

### లెర్నింగ్ బై డూయింగ్..

21వ శతాబ్దంలో నైపుణ్యాలతో కూడినటువంటి కోర్సుల అవశ్యకతను పార్థసారథి వివరించారు. విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని కోర్సుల రూపకల్పన చేయాల్సిన అవసరం ఉందన్నారు. లెర్నింగ్ బై డూయింగ్ (నేర్చుకుంటూ పనిచేయడం) అనే నినాదంతో విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. మనం చదివిన చదువు ఉపాధి కల్పించే మార్గాలను అన్వేషించాలన్నారు. దానికి సృజనాత్మకత తోడు కావడంతో ఉద్యోగ అవకాశాలు కల్పించే సంస్థలు ముందుకొస్తాయని తెలియ జేశారు. విషయాన్ని అందరికీ పంచాలి అనే నినాదంతో ముందుకెళ్లిన మేథావులైనటువంటి యూట్యూబ్ నుంచి మైక్రోసాఫ్ట్ తదితర 25 సంస్థల సీఈఓలు మన భారతీయులేనని, అది మనందరికీ గర్వకారణం అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో నేడు సూపర్ ఏఐ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కొత్త కోణాన్ని ఆవిష్కరించిందని తెలిపారు. ఆర్జీయూకేటీ డైరెక్టర్ సతీష్ కుమార్ ప్రారంభోపన్యాసంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ముధోల్ సీఐ వినోద్ రెడ్డి, బాసర ఎస్సై గణేష్, సమన్వయకర్త రాజేష్ రెడ్డి, అధ్యాపకులు హరిబాబు, డాక్టర్ పావని, డీసీఆర్ ఓ తిరుమల, సృజన, బద్రి నారాయణ, హరికృష్ణ, ఇంజనీరింగ్ విభాగాధిపతులు, సిబ్బంది ఇంజనీరింగ్ మూడో సంవత్సర విద్యార్థులు పాల్గొన్నారు.









# జిమ్ కష్టాలు..

పాన్ ఇండియా లెవల్లో వరుస ఆఫర్స్ అందుకుంటూ ఫుల్ బిజీగా ఉంది రష్మిక మందన్నా. పుష్ప తో ఈ అమ్మడి రేంజ్ ఒక్కసారిగా మారిపోయింది. శ్రీవల్లి పాత్రలో రష్మిక నటనకు ప్రశంసలు అందుకుంది. ఈ బాక్సాఫీస్ వద్ద మంచి విజయం అందుకోవడంతో బాలీవుడ్ నుంచి ఈ బ్యూటీకి ఆఫర్స్ క్యూ కట్టాయి. దీంతో హిందీలో వరుస చిత్రాలతో క్షణం తీరిక లేకుండా గడిపేస్తుంది రష్మిక. ఇప్పటికే గుడ్ బై, మిషన్ మజ్ను చిత్రాలతో నార్త్ ఆడియన్స్‌ను అలరించిన ఈ కన్నడ బ్యూటీ.. ఇప్పుడు యానిమల్ తో మరోసారి ప్రేక్షకులను మెప్పించేందుకు సిద్ధమవుతుంది. డైరెక్టర్ సందీప్ వంగా దర్శకత్వం వహిస్తోన్న ఈ మూవీలో బీటౌన్ హీరో రణబీర్ కపూర్ హీరోగా నటిస్తున్నారు. మరోవైపు పుష్ప 2 చిత్రీకరణలోనూ పాల్గొంటుంది. ఇటీవలే ఆమె సెట్ లో అడుగుపెట్టినట్లు తెలియజేస్తూ పుష్పరాజ్ విల్లాను తన ఇన్ స్టా స్టోరీలో షేర్ చేసింది. అయితే తాజాగా ఈ బ్యూటీ జిమ్‌లో తెగ కష్టపడుతోన్న వీడియో ఇప్పుడు నెట్టింట చక్కర్లు కొడుతుంది. సాధారణంగా హీరోయిన్స్ ఫిట్నెస్ విషయంలో ఎక్కువగా ఫోకస్ పెడుతుంటారన్న సంగతి తెలిసిందే. జిమ్ లో కష్టతరమైన వర్కవుట్స్ చేయడం.. డైట్ ఫాలో కావడం చేస్తుంటారు. తాజాగా రష్మిక లెగ్ వర్కౌట్ తో ఎంత కష్టపడుతుందో ఓ వీడియో చూస్తే అర్థమవుతుంది. ఇదిలా ఉంటే.. యానిమల్, పుష్ప 2 చిత్రాలు మాత్రమే కాకుండా రష్మిక చేతిలో లు ఉన్నాయి. ఇటు నితిన్ సరసన ఓ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. అయితే ఈ మూవీ నుంచి రష్మిక తప్పుకుందంటూ కొద్ది రోజులుగా వినిపిస్తున్నాయి. అయితే ఈ వార్తలపై ఎలాంటి అఫీషియల్ ప్రకటన మాత్రం రాలేదు. అటు బాలీవుడ్ ఇండస్ట్రీలోనూ రష్మికకు అవకాశాలు వస్తున్నట్లుగా సమాచారం.






## క్లీవేజ్ అందాలతో..

టాలివుడ్ స్టార్ హీరోయిన్లలో ఒకరు రాశి ఖన్నా.. ఒకప్పుడు వరుస హిట్ సినిమాలతో బిజీగా ఉన్న ఈ అమ్మడు.. ఈమధ్య సినిమా అవకాశాలు తగ్గినట్లు కనిపిస్తున్నాయి.. కానీ సోషల్ మీడియాలో వరుస ఫోటో షూట్ల తో ఫ్యాన్ ఫాలోయింగ్ ను పెంచుకుంటూ వస్తుంది.. తాజాగా బ్లాక్ ఫిట్ డ్రెస్సులో క్లివేజ్ షో చేసింది.. హాట్ అందాలతో కిల్లింగ్ లుక్ ఫోటోలను నెట్టింట షేర్ చేసింది.. ఆ ఫోటోలు ఇంటర్నెట్ ను షేక్ చేస్తున్నాయి.. తాజాగా ముంబై వేదికగా జరిగిన గ్లోబల్ స్పా అవార్డ్స్ ఈవెంట్లో రాశి ఖన్నా తళుక్కున మెరిశారు. ఆమె బ్లాక్ డిజైనర్ వేర్లో సందడి చేశారు. రాశి ఖన్నా గ్లామరస్ లుక్ వైరల్ అవుతుంది.. బ్లాక్ బాడీ కాన్ డ్రెస్ లో రాశి ఖన్నా క్లీవేజ్ అందాలు మైండ్ బ్లాక్ చేశాయి. అవార్డుల ఈవెంట్లో అందరి కళ్ళు ఆమె మీదే ఉన్నాయి.. ఈ ఈవెంట్ కు అమ్మడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.. ఇక ఈ మధ్య ఎక్కువగా ముంబైలోనే ఉంటున్న రాశి ఖన్నా అక్కడి దర్శక నిర్మాతలను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు..తెలుగులో గత రెండేళ్లుగా హిట్ సినిమాలు లేకపోవడంతో బాలివుడ్ బాట పట్టింది.. అక్కడ పాగా వేసేందుకు తెగ ప్రయత్నాలు చేస్తుంది.. ప్రస్తుతం సిద్ధార్థ్ మల్హోత్రా హీరోగా తెరకెక్కుతున్న యోధ మూవీలో రాశి ఖన్నా హీరోయిన్ గా నటిస్తుంది. యోధ ఈ ఏడాది చివర్లో విడుదల కానుంది.. అలాగే తమిళంలో అరణ్మణై, మేథావి చిత్రాల్లో నటిస్తున్నారు. ఇవి రెండు చిత్రీకరణ దశలో ఉన్నాయి. 2020 తర్వాత రాశి ఖన్నా తమిళంలో అధికంగా చిత్రాలు చేయడం విశేషం. కార్తీకి జంటగా ఆమె నటించిన సర్దార్ హిట్ టాక్ తెచ్చుకుంది. ఇకపోతే ఈ అమ్మడు నటించిన లేటెస్ట్ క్రైమ్ థ్రిల్లర్ పార్జీ. షాహిద్ కపూర్, విజయ్ సేతుపతి ప్రధాన పాత్రలు చేశారు.

## శింబుకు రెడ్ కార్డు జారీ?

కోలీవుడ్ స్టార్ హీరోలకు తమిళనాడు చిత్ర నిర్మాతల మండలి బిగ్ షాక్ ఇచ్చింది. ధనుశ్, విశాల్, అథర్వ, శింబు లాంటి స్టార్ హీరోలకు రెడ్ కార్డు జారీ చేసేందుకు రెడీ అయింది. తాజాగా జరిగిన సర్వసభ్య సమావేశంలో తమిళనాడు చిత్ర నిర్మాతల మండలి ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రొడ్యూసర్ మైఖేల్ రాయప్పన్‌తో వచ్చిన వివాదాల నేపథ్యంలో శింబుకు రెడ్ కార్డు జారీ చేయనున్నారు. ఎందుకంటే ఈ వివాదంపై ఇప్పటికే చాలా సార్లు చర్చలు జరిపిన కూడా శింబు నుంచి ఎలాంటి మార్పు రావట్లేదు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.





## మెరిసిన మెరుపుతీగ

ఆసియా కప్‌లో భారత్, పాకిస్థాన్ మధ్య సూపర్ 4 మ్యాచ్ జరగడానికి ముందు ఓ అందమైన అమ్మాయి టీవీల్లో ఒక్కసారిగా తళక్కుమంది. ఆ మెరుపు తీగను చూసిన క్రికెట్ ప్రేమికులు ఆమె కోసం ఇంటర్నెట్‌లో వెతకడం మొదలు పెట్టారు. ఎంతలా అంటే.. ఈ ముద్దుగుమ్మ ఎవరూ..? అంటూ సోషల్ మీడియాలో ఫోటోలు, వీడియోలను షేర్ చేయడంతో ఒక్కసారిగా వైరల్ అయ్యింది. పాకిస్తాన్‌తో మ్యాచ్‌కు ముందు ఈ అమ్మాయి భారత జట్టు జెర్సీని ధరించి టీమిండియాకు మద్దతుగా నిలిచింది. ఆసియా కప్ సూపర్-4లో భారత్ మరియు పాకిస్తాన్ మరోసారి తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో బాబర్ అజామ్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు వచ్చిన రోహిత్ శర్మ, శుభమన్ గిల్ పవర్ ప్లేలో పాక్ ఫాస్ట్ బౌలర్లను చిత్తు చేశారు. దీంతో స్టేడియంలో ఉన్న ప్రేక్షకులు భారత బ్యాటింగ్‌ను ఉత్సాహపరిచారు. అయితే, సరిగ్గా అదే సమయంలో ఈ చిన్నది కనిపించి కనువిందు చేసింది. ఈ అమ్మాయి ఆఫ్ఘనిస్తాన్‌కి చెందినది ఈమె పేరు వాజ్మా అయుబి. వాజ్మా ఓ వ్యాపారవేత్త, మోడల్, క్రికెట్ ఫ్యాన్.. క్రికెట్ మ్యాచ్‌లలో ఆఫ్ఘనిస్తాన్‌ను ఉత్సాహపరుస్తున్న వాజ్మా అయూబీ చాలాసార్లు కనిపించింది. ఆఫ్ఘనిస్తాన్ తర్వాత ఆమె ఏదైనా జట్టుకు అభిమాని అయితే అది టీమిండియా అని ఆమె స్వయంగా వ్యక్తం చేసింది. వజ్మా భారతదేశాన్ని తన రెండవ ఇల్లు అని కూడా అభివర్ణించారు.

# ధార్మిక భవన్ ప్రారంభం

### ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

### భద్రకాళి, వేయి స్తంభాల గుడిలో ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ జోన్ వారి ధార్మిక భవన్ ను గురువారం రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ప్రారంభించారు. పాత సెంట్రల్ జైలుకి ఎదురుగా 1074 చదరపు గజముల ప్రభుత్వ స్థలంలో రూ.4.5 కోట్ల వ్యయంతో నిర్మించారు. దేవాదాయ శాఖ, వరంగల్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీకాంతారావు, వరంగల్ ఉమ్మడి జిల్లాల అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత వ్యక్తిగత శ్రద్ధతో అతి తక్కువ సమయంలో ప్రజలకు అత్యంత సౌకర్యంగా, సుందరంగా నిర్మాణం జరిపించినందుకు మంత్రి వారిని అభినందించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఎర్పడ్డాక సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతీ శాఖ తమ ప్రతిభను చాటుతూ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి పాటుపడటం అభినందనీయమని ఇంద్రకర్ రెడ్డి తెలిపారు. ధూప, దీప నైవేద్యాలకు రూ.2,500ల నుంచి రూ.6,500లకు ఇటీవల రూ.10వేలకు పెంచడమే కాకుండా అర్చులకు ప్రభుత్వ ఖజానా నుంచి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు ఇవ్వడం దేశం మొత్తంలో ఈ రాష్ట్రానికే చెల్లిందన్నారు.

#### పూర్ణకుంభ స్వాగతం..

కార్యాలయ భవనం ఆవిష్కరణకు విచ్చేసిన మంత్రులు, శాసన సభ్యులకు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ టి. శ్రీకాంతారావు, సహాయ కమిషనర్ ఆర్.సునీత పూలమాలు వేసి పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వెంట తెలంగాణ రాష్ట్ర పంచాయతీ శాఖామాత్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు, గిరిజన సంక్షేమ శాఖామాత్యులు సత్యవతి రాథోడ్, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్, ప్లానింగ్ కమిషన్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్.సుందర్ రాజ్ యాదవ్, హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ వి.అనిల్ కుమార్, దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ జోన్ల వివిధ జిల్లాల సహాయ కమిషనర్లు, వివిధ ఆలయాల కార్యనిర్వహణాధికారులు, సిబ్బంది, అర్చకులు, వేదపండితులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఆసాంతం ఒక పండుగ వాతావరణంలో జరిగింది.

#### మాడ వీధులకు రూ.30కోట్లు..

సభాధ్యక్షత వహించిన దాస్యం వినయ భాస్కర్ మాట్లాడుతూ భద్రకాళి ఆలయ మాదవీధుల నిర్మాణం నిమిత్తం రూ.30 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. సమాజంలో ఆధ్యాత్మిక భావన పెంపొంది శాంతి సామరస్యాలతో సమాజం వర్ధిల్లే విధంగా జరిపే కృషిలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఇతోదికమైన తోడ్పాటును అందించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. పంచాయితీ రాజ్ శాఖామాత్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ తెలంగాణలో వరంగల్ ఉమ్మడి జిల్లాలో వల్మిడి, పాలకుర్తి, బమ్మెర మూడు పక్క పక్క గ్రామాలలో శ్రీమద్రామాయరణ కర్త ఆదికవి వాల్మీకి, తెలుగు సాహితీవేత్త పాల్కుర్కి సోమనాథుడు, శ్రీమదాంధ్రమహాభాగవతకర్త బమ్మెర పోతన జన్మించిన స్థానాలలో వందల కోట్ల ప్రభుత్వ ధనాన్ని వెచ్చించి ప్రఖ్యాత పర్యాటక క్షేత్రంగా తీర్చి దిద్దడంతోపాటు సుందర భవ్య రామాలయ నిర్మాణం కూడా జరిపినట్లు తెలిపారు. ప్రజలు ఈ క్షేత్రాలను దర్శిస్తూ స్వాంతన పొందడమే కాకుండా అద్వితీయమైన ఆధ్యాత్మిక అనుభూతిని పొందాలని ఇందుకు దేవాదాయ శాఖ వారి తోడ్పాటు చాలా అవసరమని తెలిపారు. అనంతరం మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో మరుగున పడివున్న పుణ్యక్షేత్రాలను వెలికితీసి వందల కోట్లతో కేసీఆర్ అభివృద్ధి జరుపడమేగాక దేశం మొత్తంలోలేని తీర్థాలు, క్షేత్రాలు, పౌరాణిక, చారిత్రక ప్రదేశాలను దేశ ప్రజలకు చాటుతూ తెలంగణకు భారతదేశం నలుమూలల నుంచి యాత్రికులు సందర్శించే విధంగా పర్యాటక రంగాన్ని అభివృద్ధి పరిచారన్నారు. అనంతరం మంత్రులు వేదపండితులను, అర్చకులను, దేవాదాయ ధర్మాదాయ శాఖ విశ్రాంత అధికారులను, సిబ్బందిని శాలువలతో సత్కరించారు.

#### భద్రకాళి, వేయి స్తంభాల గుడిలో పూజలు..

నగరానికి విచ్చేసిన మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి తొలుల సుప్రసిద్ధ భద్రకాళి దేవాలయాన్ని సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన మంత్రి, ఇతర ప్రముఖులకు ఆలయ ఈఓ కె.శేషుభారతి, ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు పూర్ణకుంభం, మంగళవాద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా ఆదిశంకరాచార్యులను, వల్లభగణపతిని దర్శించిన అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజానంతరం ఆలయ మహాపండపంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేదపండితులు, ముఖ్యఅర్చకులు, అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించగా, కార్యనిర్వహణాధికారి శేషుభారతి అమ్మవారి శేషవస్త్రాలు బహూకరించి ప్రసాదములు అందజేశారు. అనంతరం వేయి స్తంభాల దేవాలయంలో రుద్రేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## ఐనవోలు చైర్మన్ పదవిని యాదవులకే ఇవ్వాలి

### ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజయ్య యాదవ్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఐయినవోలు మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మన్ పదవిని యాదవులకే ఇవ్వాలని అఖిలభారత యాదవ మహాసభ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గిరబోయిన రాజయ్య యాదవ్ కోరారు. గురువారం హనుమకొండ పింజర్ల వీధిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో యాదవులు 50 లక్షల మంది ఉన్నారన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో 40 వేల మంది యాదవులు ఉన్నారని చెప్పారు. యాదవుల ఇలవేల్పు మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మన్ పదవిని యాదవులు కేటాయించి సముచిత స్థానం కల్పించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ను కోరారు.



సమావేశంలో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నక్క కొమురెల్లి, జిల్లా సహాయ కార్యదర్శి భైరబోయిన కోటేశ్వర్, గొర్ల కాపరుల సొసైటీ వైస్ చైర్మన్ కాబట్టి సారయ్య యాదవ్, ఐయినవోలు మండల అధ్యక్షులు రాజారపు రాజు యాదవ్, జిల్లా నాయకులు జె .లవన్ యాదవ్, సంగే శ్రీను, జిల్లా వర్తక సంఘం అధ్యక్షులు జక్కుల రాజు యాదవ్, జక్కుల శివకుమార్, గాజు రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఐసీ ఏజెంట్లకు తీపి కబురు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ రంగ సంస్థలైన భారతీయ జీవితం బీమా ఏజెంట్లకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించడమే కాక, గ్రాట్యూటీ టర్మ్ ఇన్సూరెన్స్ పెంచడంపై ఎల్ఐసీ ఏజెంట్స్ సంగ్ (బీఎల్ఐఏఎస్) గౌరవ అధ్యక్షుడు పిన్నింటి సంపత్ రావు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎల్ఐసీ ఏజెంట్ల గ్రాట్యూటీ రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు, టర్మ్ ఇన్సూరెన్స్ కవరేజీని రూ.25 వేల నుంచి రూ.15 లక్షల స్థాయికి పెంచుతున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో దేశవ్యాప్తంగా ఉన్న 13 లక్షల ఏజెంట్లకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఈ ఏడాది అధిక వర్షాలతో ఆర్థిక వ్యవస్థ కుంటు పడిపోయిందని, ఏజెంట్లకు ఫ్లడ్ అడ్వాన్సులు ఇవ్వాలని కోరారు. పాలసీదారుల ప్రీమియం ఇంట్రెస్ట్ రేట్ ను తగ్గించాలని, పాలసీలలోను పై ఇంట్రెస్ట్ రేట్లు తగ్గించాలని సంపత్ రావు డిమాండ్ చేశారు.

## 28న మిలాద్ ఉన్ నబి ర్యాలీ




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మరోమారు మతసామరస్యాన్ని చాటుకుంటూ మిలాద్ ఉన్ నబి పండుగ ర్యాలీని 28వ తేదీకి వాయిదా వేస్తున్నట్లుగా ట్రై సిటీ ముస్లిం మత పెద్దలు ప్రకటించారు. ఈ నెల 27వ తేదీన వినాయక నిమజ్జనంతో పాటు ముస్లింలకు సంబంధించిన మిలాద్ ఉన్నబి పండుగ కావడంతో వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు గురువారం వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి అధ్వర్యంలో ట్రై సిటీ చెందిన ముస్లిం మత పెద్దలతో ఆత్మీయ సమావేశాన్ని కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ముస్లిం మత పెద్దలు కాజీపేట దర్గా పీఠాధిపతి సయ్యద్ గులాం అఫ్జల్ బియబాని ( కుస్రూపాషా), మండిబజార్ కు చెందిన జార్ఫ్హాల్ల అబిదీన్, మట్టేవాడ, సుబేదారి ఇన్స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, షూకూర్తో పాటు, ట్రై సిటీకి చెందిన ప్రముఖ మస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## విష్ణువర్ధన్‌కు జాతీయ పురస్కారం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్ ను మహాత్మా జ్యోతి రావు పూలే జాతీయ పురస్కారంతో ఘనంగా సత్కరించి, శాలువా, మెమెంటో, మెడల్, ప్రశంసా పత్రం అందజేశారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా వివిధ రంగాలలో ప్రతిభ కనబరుస్తూ అంకితభావంతో పనిచేస్తున్న వారికి తెలుగు వెలుగు సాహితీ వేదిక తరపున జాతీయ పురస్కారాలను ప్రదానం చేస్తున్నారు. హనుమకొండ నయీంనగర్ కు చెందిన విష్ణువర్ధన్ కాకతీయ విశ్వవిద్యాలయంలో గత 27 సంవత్సరాలుగా తాత్కాలిక ఉద్యోగిగా బాధ్యతలు నిర్వర్తించడంతో పాటు సుమారు ఐదు సంవత్సరాల బోధనానుభవం కలిగి 17 సంవత్సరాల నుంచి జర్నలిస్ట్ గా కొనసాగుతూ అనేక సామాజిక, సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నందుకు గాను తెలుగు వెలుగు సాహితీ వేదిక విష్ణువర్ధన్ కు మహాత్మా జ్యోతి రావు పూలే జాతీయ పురస్కారాన్ని ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కేయూ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బానోత్ సురేష్ లాల్, తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ చైర్మన్ పోలోజు రాజ్ కుమార్, కన్వీనర్ డాక్టర్ వలబోజు మోహన్ రావు, డాక్టర్ మారేడుగొండ బ్రహ్మయ్య, డాక్టర్ సుద్దాల విద్యాసాగర్, మహమ్మద్ అబీద్ అలి, రాజు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com